"కోటీకెళ్ళాలోయ్..." అన్నాడు శివుడు.

"మీటరు మీద యాభయ్ రూపాయలివ్వాలి" అన్నాడు టాక్సీవాడు.

"ఎందుకూ"

"పిచ్చిప్రశ్న లేయకు? ఎందుకేమిటి? అందుకిష్టమయితే రా, లేకపోతే ఫో!" టాక్సీ స్టార్టుచేసి వెళ్ళిపోబోయాడు వాడు.

శివుడు గాభరాగా వెంబడిపడ్డాడు.

"సరే– అలాగే తీసుకొందువుగాన్లే! ఆపు" అన్నాడు బ్రతిమాలుతూ.

టాక్సీవాడు ఆపి వెనుకడోర్ తెరిచాడు. శివుడూ పార్వతి లోపల కూర్చున్నారు... టాక్సీ బయల్దేరింది.

"ఇదే ఊరు? ఏ ప్రాంతం?" అడిగాడు శివుడు టాక్సీ డ్రైవరుని.

"ఇదా? హైద్రాబాద్! ఆంధ్రేరాప్రదేశ్ రాజధాని!" జవాబిచ్చాడు టాక్సీవాడు.

టాక్సీ కోఠీలో ఆగింది.

మీటరుచూసి రెండు పదినోట్లు తీసి ఇచ్చాడు శివుడు.

"మీ ఊళ్ళో టాక్సీలుండవా?" అడిగాడు టాక్సీడ్రైవరు.

"ఉంటాయి! కాని వాటికి మీటర్లుండవు... సీట్లూ వుండవ్–" అంది పార్వతి– టాక్సీ వెళ్ళిపోయింది. బాగా రద్దీగా వుందారోడ్డు.

"అబ్బ! ఎంత బావుందో ఈ సెంటరు"ఆనందంగా అంది పార్వతి చుట్టూ ఉన్న షాపులవంక చూస్తూ. ఇద్దరూ కొద్ది దూరం నడిచారు. కాఫీ హోటల్ అన్న బోర్డు కనిపించింది వారికి!

"నాకు కాఫీ తాగాలని వుంది నాథా!" అంది పార్వతి.

ముందు నడుస్తోన్న ఓ యువకుడి భుజం మీద తట్టి "ఇక్కడ నుంచి కాఫీ హోటల్ ఎక్కడుందో తెలుసా బాబూ?" అనడిగాడు శివుడు.

"ఏమిటీ అన్నావ్? బాబూ అనా? అంటే నేను మగరాయుడిలా కనబడుతున్నానా నీ కళ్ళకి? లేకపోతే తెలీనట్లు నటించి నా భుజం మీద చేయివేద్దామనా?" కోపంగా అడిగిందా యువతి చొక్కా చేతులుపైకి మడుస్తూ.

శివుడు భయపడిపోయాడు. "పొరబాటయింది. మీరు ఆడపిల్ల అనుకోలేదు" అన్నాడు నొచ్చుకుంటూ.

"అలా దారికి రా! అదిగో!" అదే ఆ కాఫీ హోటలు బాగుంటుంది–" అందా అమ్మాయ్ – దూరంగా ఉన్న ఒక హోటల్ చూపిస్తూ –

శివుడూ, పార్వతీ ఆ హోటల్లోకి నడిచారు.

"ఫలాహారా లేవున్నయ్?" సర్వర్‌ని అడిగాడు శివుడు.

"ఇడ్లీ, వడా, దోసె, ఊతప్పా, పూరీ."

"దోశె ఎంత?" అడిగాడు శివుడు.

"నూట ముప్పై రూపాయలు..."

కెవ్వున కేకవేశాడు శివుడు.

"ఏమిటి? దోశె నూటముప్పైరూపాయలా?"

"ఇష్టమయితే తిను, లేకపోతే బయటకు ఫో! ఆ కేకలేమిటి అసహ్యంగా!" కోప్పడ్డాడు సర్వరు.

"అదికాదు మరీ నూట ముప్పైరూపాయలనేసరికి భయం వేసింది. అయినా ఇలా ఇష్టమొచ్చినట్లు హోటల్‌వాళ్ళు ధరలు పెంచేస్తే అడిగేవారెవరూ లేరా ఇక్కడ?"

సర్వర్ ఘొల్లున నవ్వాడు.

"పిచ్చి నాయనా! ఇది ఆంధ్రప్రదేశ్! ఇక్కడ హోటల్‌వాళ్ళ జోలికొచ్చే వారెవరూ లేరు. ఇదే మద్రాస్‌గానీ, బొంబాయిగానీ అయితే హోటల్‌వాళ్ళ మీద చాలా కంట్రోల్స్ ఉన్నాయిగానీ దేముడి దయవల్ల మాకలాంటి యిబ్బందులేమీ లేవు. మా ఇష్టం!మా రాజ్యం! రేపొద్దున్న దోసె రెండు వందల రూపాయలన్నా సరే అందరూ నోర్మూసుకొని తినాల్సిందే...అది సరేగానీ నీకేం ఇమ్మంటావ్ ఇప్పుడు? ఒన్ బైటూ కాఫీ ఇవ్వనా?"

సరేనని తలూపాడు శివుడు. బయట పెద్ద వర్షం కురిసి వెలిసిపోయింది.

రెండు నిమిషాల్లో రెండు కప్పుల్లో సగానికి కాఫీ తెచ్చి ఇచ్చాడు సర్వరు.

తాగి బిల్లు చెల్లించి బయటికొచ్చారిద్దరూ. రోడ్లమీద గుంటలన్నీ వర్షం నీటితో నిండివున్నయ్.

"అబ్బ.. ఎంత బావుందో ఆ నీళ్ళ గుంటలు" నీళ్ళగుంటల్లో నడుస్తూ అంది పార్వతి.

అంటూనే 'అమ్మో' అని కేకవేసి గుంటలో మెడలోతుకి దిగిపోయింది. అదే క్షణంలో జనమంతా పోగయి ఆమెని బయటకు లాగారు.

